తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ళ ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026

## బాలత్రిపుర సుందరిగా ముత్యాలమ్మ



బంగారుపాళ్యం, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బాల త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ సోమవారం రాత్రి భక్తులకు దర్శనమిచ్చారు. బంగారుపాళ్యం గ్రామ దేవత ముత్యాలమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆలయంను విద్యుత్ దీపాలు, వివిధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మూల విరాట్ అమ్మవారికి అర్చకులు మురళీస్వామి, కార్తీక్ స్వామిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అమ్మవారి ఉత్సవమూర్తిని బాల త్రిపుసుందరిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అలంకరణకు నందిని టెక్స్‌టైల్స్ యాజమాన్యం ప్రియాంక, వేణు, మొగిలి వెంకటగిరికి చెందిన భార్గవి, గజేంద్రలు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎంబి కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెద్దశేష వాహనంపై మలయప్ప





తిరుమల, అక్టోబర్ 12 ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజు రాత్రి శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి గోవిందరాజస్వామి అలంకారంలో ఏడుతలల స్వర్ణశేషవాహనంపై(పెద్ద శేషవాహనం) తిరుమాడ వీధులలో భక్తులను అనుగ్రహించారు. ఆదిశేషుడు తన పడగ నీడలో స్వామివారిని సేవిస్తూ పాన్పుగా దాస్యభక్తిని చాటుతున్నాడు. ఆదిశేషుడు శ్రీహరికి మిక్కిలి సన్నిహితుడు. రామావతారంలో లక్ష్మణుడుగా, ద్వాపరంలో బలరాముడుగా శ్రీమన్నారాయణుడికి మిక్కిలి సన్నిహితంగా ఉన్నవాడు శేషుడు. ఈయన శ్రీభూదేవి సహితుడైన వేంకటేశ్వరుని వహిస్తూ తొలిరోజు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర దంపతులు, అదనపు ఈఓ సి.హెచ్.వెంకయ్య చౌదరి దంపతులు, సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఆలయ డిప్యూటీ ఈఓ భాస్కర్, ఎస్వీబిసి ఛైర్మన్ బి.శ్రీధర్‌వర్మ ,అర్చకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి మేయర్‌పై వీడిన ఉత్కంఠ!

### -జనరల్ కేటగిరితో మారిన రాజకీయ సమీకరణాలు





ప్రభాతవార్త-తిరుపతి:

తిరుపతి మేయర్ పదవిని జనరల్ కేటగిరికి కేటాయించడంతో గత నెల రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. రిజర్వేషన్లు బిసిలకు అనుకూలంగా వస్తాయా? జనరల్ కేటగిరికి కేటాయిస్తారా అనే సందిగ్ధంలో ఉన్న ఆశావహులు ఇప్పుడు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ముఖ్యంగా అధికార కూటమిలోని టిడిపి, జనసేన పార్టీలకు చెందిన పలువురు నేతలు మేయర్ అభ్యర్థిత్వంపై ఆశలు పెట్టుకున్నారు.సోమవారం రిజర్వేషన్లను అధికారికంగా ప్రకటించడంతో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. తిరుపతి మేయర్ స్థానం జనరల్ కేటగిరికి కేటాయించడంతో బిసిలకు రిజర్వేషన్ ప్రాతిపదికన లభించే అవకాశం లేకుండా పోయింది. దీంతో టికెట్ ఆశిస్తున్న నేతలు తమ సామాజిక వర్గ బలం, పార్టీ అధిష్ఠానం మద్దతు, రాజకీయ అనుభవాలను ముందుకు తెస్తున్నారు.

**టిడిపిలో పలువురి పేర్లు**

టిడిపిలో ఐదారుగురు యాదవ సామాజిక వర్గానికి చెందిన నేతలు మేయర్ టికెట్ కోసం పోటీపడుతూ గత కొంతకాలంగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకున్నారు. అలాగే టిడిపి జనసేన పార్టీలకు చెందిన బలిజ సామాజిక వర్గ నేతలు సైతం టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. అయితే తిరుపతి ఎమ్మెల్యేగా జనసేనకు చెందిన శ్రీనివాసులు కొనసాగుతున్న నేపథ్యంలో, అదే సామాజిక వర్గానికి మరో కీలక పదవి కేటాయించే విషయంలో పార్టీ అధిష్ఠానం ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో మేయర్ స్థానాల్లో తిరుపతి, నెల్లూరు, విజయవాడ, ఒంగోలు మాత్రమే జనరల్ కేటగిరికి కేటాయించబడ్డాయి. వీటిలో విజయవాడ, ఒంగోలు మేయర్ స్థానాల కోసం జనసేన పట్టుబడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తిరుపతి, నెల్లూరు స్థానాలను టిడిపికి కేటాయించే అవకాశాలున్నాయని సమాచారం. తిరుపతిలో వైసిపి రీజినల్ కోఆర్డినేటర్ భూమన కరుణాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భూమన అభినయ్ రెడ్డిల రాజకీయ ప్రభావాన్ని ఎదుర్కోవాలంటే బలమైన అభ్యర్థిని రంగంలోకి దించాలని టిడిపి వర్గాలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం కల్పించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు సమాచారం. రాయలసీమలోని ఐదు మేయర్ స్థానాల్లో రెడ్డి సామాజిక వర్గానికి కనీసం ఒక స్థానమైనా కేటాయించాలనే ఆలోచన సిఎం చంద్రబాబు నాయుడుకు ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మిగిలిన స్థానాలు వివిధ కేటగిరీలకు రిజర్వు కావడంతో తిరుపతిలో రెడ్డి సామాజిక వర్గానికి అవకాశం కల్పించవచ్చని కొందరు నేతలు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.ఈ నేపథ్యంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. జాతీయ క్రీడాకారుడిగా, అంతర్జాతీయ శిక్షకుడిగా గుర్తింపు పొందడంతోపాటు యువకుడు, విద్యావంతుడు కావడం ఆయనకు అనుకూల అంశాలుగా ప్రచారం జరుగుతోంది. ఆయన అభ్యర్థిత్వం పట్ల పార్టీ అధిష్ఠానం మొగ్గ చూపుతున్నట్లు ఒక వర్గం చెబుతోంది. మేయర్ అభ్యర్థిత్వం కోసం మబ్బు దేవనారాయణ రెడ్డి పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు మరో వర్గం చెబుతోంది. మరోవైపు, సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుంటే యాదవులకు అవకాశం కల్పించవచ్చనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. గత ఎన్నికల్లో తిరుపతి మేయర్ స్థానం జనరల్ మహిళకు కేటాయించినప్పటికీ, వైసిపి బిసి యాదవ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఆర్. శిరీషకు అవకాశం కల్పించింది. ఈసారి కూడా టిడిపి అదే తరహాలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తుందా? లేక జనరల్ కేటగిరికి అనుగుణంగా రెడ్డి సామాజిక వర్గం నుంచి అభ్యర్థిని ఎంపిక చేస్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. మేయర్ అభ్యర్థి ఎంపిక విషయంలో వైసీపీ కూడా ఆచితూచి అడుగులు వేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. గతంలో జనరల్ మహిళకు కేటాయించిన స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ ఆర్. శిరీషకు అవకాశం కల్పించినప్పటికీ, ఆశించిన రాజకీయ ప్రయోజనం దక్కలేదని వైసీపీ వర్గాల్లో కొందరు అభిప్రాయపడుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. మొత్తానికి, రిజర్వేషన్ల ప్రకటనతో మేయర్ పదవికి సంబంధించిన ఒక కీలక సందిగ్ధత తొలగిపోయినా, అభ్యర్థుల ఎంపికపై మాత్రం ఉత్కంఠ కొనసాగుతోంది.

## శ్రీలక్ష్మి అలంకరణలో పెద్దశేష వాహనంపై ఎల్లమ్మ

### వైభవంగా దేవీ నవరాత్రి మహోత్సవాలు



చంద్రగిరి, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

శ్రీ లక్ష్మి అలంకరణలో శ్రీ మూలస్థాన ఎల్లమ్మ పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. చంద్రగిరి గ్రామదేవత శ్రీ మూలస్థాన ఎల్లమ్మ వారి ఆలయంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ ఛైర్మన్ మొక్కల చంద్రశేఖర్ రెడ్డి పాలక మండలి, ఈఓ మమత పర్యవేక్షణలో వార్షిక దేవీ నవరాత్రి మహోత్సవాలను అ ంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం రాత్రి 7 గంటలకు ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తిని వాహన మండపానికి వేంచేపు చేశారు. ఆలయ పూజారి సూరి స్వామి వివిధ రకాల సుగంధ భరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో లక్ష్మీదేవిగా విశేష అలంకరణ గావించి పెద్దశేష వాహనంపై అధిష్టింపజేశారు. మేళతాళాలు, బ్యాండుభాజాలతో అమ్మవారి వాహన సేవ కన్నుల పండువగా సాగుతుండగా మహిళలు మంగళహారతులతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి, దాతలు, గ్రామస్థులు, ఓంశక్తి భక్తులు పాల్గొన్నారు.

# బిసీ జనరల్‌కు మేయర్ కుర్చీ











### - 'దేశం' తెరపై నలుగురు మహిళలు - వైఎస్ఆర్ కాంగ్రెస్ తరపున పోటీలో ఇద్దరు నాయకులు

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ మేయర్ కుర్చీ రిజర్వేషన్ బిసీ జనరల్ కేటగిరికి వరించింది. చిత్తూరు మేయర్ కుర్చీ బిసీ జనరల్‌కు కేటాయించడంతో ఇటు అధికార తెలుగుదేశం, ఇటు ప్రతిపక్ష వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మేయర్ అభ్యర్థులుగా పోటీ చేయడానికి బిసీ అభ్యర్థులు తెరపైకి వచ్చారు. అధికార కూటమి పార్టీల నుండి మేయర్ స్థానం తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి నలుగురు పోటీ పడుతున్నారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా వుండటంతో అదే సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు తెలుగుదేశం పార్టీ తరపున మేయర్ అభ్యర్థులుగా పోటీ చేయడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో మాజీ మేయర్ కఠారి హేమలత రిజర్వేషన్ల రూపంలో ఈ సారి వచ్చిన అవకాశంను మరోసారి తనకు అనుకూలంగా మార్చుకుని తెలుగుదేశం పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా బరిలో నిలవాలని ప్రయత్నాలు ప్రారంభించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్న సమయంలోనే తన అత్త, మామలైన దివంగత మేయర్ కఠారి అనురాధ, కఠారి మోహన్‌లు హత్యకు గురి కావడంతో అప్పటి వరకు తెరవెనుక వున్న కఠారి హేమలత తెరపైకి వచ్చారు. మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గ పదవికాలం రెండేళ్ళు మాత్రమే వున్న సమయంలో పార్టీ అధిష్టానం కఠారి హేమలతను మేయర్‌గా ఎంపిక చేయడంతో ఆమె గతంలో రెండేళ్ళు మాత్రమే మేయర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మేయర్ కుర్చీకి రిజర్వేషన్ తనకు అనుకూలంగా రావడంతో మరోసారి తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని ఆమె పార్టీ అధిష్టానంను కోరుతున్నారు. అలాగే సీనియర్ తెలుగుదేశం నాయకులు కాజూరు బాలాజీ ప్రస్తుత ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుకు సన్నిహితంగా వుంటూ తెలుగుదేశం పార్టీ తరపున మేయర్ అభ్యర్థిగా పోటీ చేయడానికి రంగం సిద్ధం చేసుకున్నారు. అయితే మేయర్ సీటు బిసీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో తన సతీమణి ద్రాక్షాయణికి పార్టీ అభ్యర్థిత్వం కేటాయించాలని కాజూరు బాలాజీ పార్టీ అధిష్టానం ద్వారా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు ఎక్కువగా వుండటం మాజీ మేయర్, ప్రస్తుత చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కాజూరు బాలాజీ సతీమణి ద్రాక్షాయణిలు ఇద్దరు బలిజ సామాజిక వర్గానికి చెందిన వారే కావడంతో వీరిద్దరిలో ఎవరికో ఒకరికి పార్టీ అభ్యర్థిత్వం కేటాయించాలని బలిజ సామాజిక వర్గానికి చెందిన నేతలు పార్టీ అధిష్టానంను కోరుతున్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ తరపున మేయర్‌గా పోటీ చేయడానికి మాజీ ఎమ్మెల్యే సికె బాబు సతీమణి సికె లావణ్యబాబు, తెలుగుదేశం నాయకులు నళిని తిరుకుమరన్‌లు సైతం తెరపై వున్నారు. మరోవైపు చిత్తూరులో తమిళులు అధిక సంఖ్యలో వుండటంతో మేయర్ అభ్యర్థిత్వం తనకు కేటాయించాలని నళిని తిరుకుమరన్ సైతం పోటీ పడుతున్నారు. ఇదిలా వుండగా వైకాపా తరపున మాజీ డిప్యూటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్‌తో పాటు వైకాపా బీసీ సంక్షేమ సంఘ నాయకులు జ్ఞాన జగదీష్‌లు మేయర్ అభ్యర్థిత్వం కోసం పోటీ పడుతున్నారు.

## 106 కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు

### ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త



నగరపాలక సంస్థ పరిధిలో 106 కోట్ల రూపాయల హైబ్రిడ్ యాన్యూటీ మోడల్ నిధులతో మౌలిక సదుపాయాలు మెరుగు పరచనున్నట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం కింద రోడ్లు, డ్రైనేజీ, వీధి లైట్లు, డివైడర్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన చెప్పారు. గొల్లవాణిగుంట పరిధిలోని శ్రీనివాస నగర్‌లో సోమవారం ఉదయం హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం(హ్యామ్) కింద నిర్మించనున్న సిసి రోడ్డుకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ జయకృష్ణ, ఎన్డీఏ కూటమి నాయకులు భూమి పూజ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లు కార్పొరేషన్ అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. హైబ్రిడ్ యాన్యుటి మోడల్ పథకం కింద 106 కోట్లు కేటాయించి నగర సుందరీకరణకు వారు సహకరిస్తున్నారని ఆయన తెలిపారు. హ్యామ్ పథకం కింద చేపట్టే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కార్పొరేషన్, మున్సిపాలిటిల్లో వెయ్యి కోట్లకు పైగా నిధులతో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని కమిషనర్ జయకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా తిరుపతికి 106 కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు కేటాయించారని ఆయన చెప్పారు. ఈ నిధులతో రోడ్లు, పార్కులు, డ్రైనేజీ, వీధి దీపాలు, డివైడర్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ రవి నాయుడు, టిడిపి పార్లమెంట్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి, యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ జేబి శ్రీనివాస్, గంగమ్మ గుడి ఛైర్మన్ మహేష్ యాదవ్, జనసేన నగర అధ్యక్షులు రాజారెడ్డి, ఎస్.ఈ శ్యామ్ సుందర్, ఈ.ఈ.గోమతి, డి.ఈ రమణ, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన మరగదాంభిగా అమ్మవారు

కాణిపాకం, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వ రాలయంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం మరగదాంభిగా అమ్మవారు శ్రీలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్ ఆధ్వర్యంలో అర్చక స్వాములు స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు ఉదయం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని శ్రీలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

## గాయత్రీ దేవి అలంకారంలో గంగమ్మ దర్శనం



తిరుపతి,అక్టోబర్ 12ప్రభాతవార్త:

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ సోమవారం గాయత్రీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారిని సుప్రభాతంతో మేల్కొలిపి అభిషేకం నిర్వహించారు. అనంతరం అర్చకులు అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్ర మంలో గంగమ్మ ఆలయ పాలకమండలి ఛైర్మన్ నైనార్ మహేశ్‌యాదవ్. ఆలయ ఈఓ ఎ.జయ కుమార్ ఆలయ అర్చకులు పాల్గొన్నారు. అనంతరం సాయంత్రం 7 గంటలకు గంగమ్మ ఊంజల్ సేవ నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు,ఆలయ పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

## పేలిన టపాకాయల గోడౌన్



బంగారుపాళ్యం, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

మండల పరిధిలోని సంక్రాంతిపల్లి వద్ద సోమవారం రాత్రి టపాకాయల గోడౌన్ పేలింది. ఈ ఘటనలో ఓ వ్యక్తి స్వల్పంగా గాయపడగా, భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. సంక్రాంతిపల్లికి చెందిన ఓ వ్యక్తి ఈ టపాకాయల గోడౌన్‌ను నిర్వహిస్తూ అమ్మకాలు సాగిస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టపాకాయల గోడౌన్ గ్రామానికి దూరంగా వుండాలి. కానీ అందుకు విరుద్ధంగా చెన్నై-బెంగళూరు జాతీయ రహదారి ప్రక్కనే ఓ ఇనుప రేకుల షెడ్‌లో టపాకాయల గోడౌన్‌ను నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం ఈ షెడ్ నందు వెల్డింగ్ పనులు చేపడుతుండగా నిప్పు రవ్వలు టపాకాయలపై పడ్డాయి. ఆ సమయంలో భారీగా టపాకాయలు పేలడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. రహదారి ప్రక్కనే టపాకాయలు పేలడంతో రహదారిపై వెళ్ళే వాహనాల రాకపోకలకు కొంత అంతరాయం ఏర్పడింది. ఈ విషయం తెలిసిన వెంటనే చిత్తూరు నుండి అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు ఘటనా స్థలం చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా రహదారి ప్రక్కన టపాకాయల గోడౌన్ నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు ఎలా అనుమతి ఇచ్చారో! అనే ప్రజలు చర్చించుకుంటున్నారు.

### శ్రీకాళహస్తి మున్సిపాలిటి బిసి జనరల్‌కు రిజర్వ్

## దేశంలో మలగుల్లాలు : వైకాపాలో అన్వేషణ





శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలో ఎన్నికల వేడి రాజుకుంది. సోమవారం రిజర్వేషన్లు ఖరారు కావటంతో ఆశావహుల్లో ఉత్కంఠత చోటుచేసుకుంది.రెండు సామాజిక వర్గాలపై చర్చ జరుగుతుంది. సోమవారం ఉదయం నుంచి ఓ రిజర్వేషన్ల మొదటి సమాచారం జాబితా హల్‌చల్ చేసింది. అందులో శ్రీకాళహస్తి మున్సిపాలిటి అన్ రిజర్వ్‌డ్ అనటంతో తెలుగుదేశం పార్టీలో ఆది నుంచి పార్టీలో ఉన్న జి.విజయకుమార్‌నాయుడు పేరు వినబడింది. ఆయన కూడా పలువురితో తనకు సహాయం చేయాలని అభ్యర్థించారు. సాయంత్రానికిఈ రిజర్వేషన్ కాస్త బిసి లకు అంటూ అధికారికంగా సమాచారం వెలువడటంతో ఒక్కసారిగా ఉత్కంఠత చోటు చేసుకుంది.

**అధికార పార్టీలనే చర్చ:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటి బిసిలకు అధికారికంగా రిజర్వ్ చేసారు.2014లో జరిగిన ఎన్నికల్లో ఈ మున్సిపాలిటిని ఓసిలకు రిజర్వ్ చేయగా అప్పటి శాసనసభ్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఈ స్థానాన్ని బిసిల్లో వన్నెకుల క్షత్రియులకు నిర్ణయించారు. ఈ స్థానంలో పార్టీలో ఆది నుంచి ఉంటూ తనకు చేదోడుగా ఉన్న పేట రాధారెడ్డికి అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఆయన తనయుడు బొజ్జల సుధీర్‌రెడ్డి ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. రాధారెడ్డి అధికారంలో ఉంటూ అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబానికి చెందిన పేట బాలాజి పేరు తెరమీదకు వచ్చింది.

**ఆది నుంచి ఎంఎల్ఏకు అనుయాయుడుగా . . .**

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో తెలుగుదేశం పార్టీ కార్యదర్శిగా యువత కార్యదర్శిగా, పట్టణ పార్టీ అధ్యక్షుడుగా 2014 నుంచి 2019 వరకు వార్డు కౌన్సిలర్‌గా పదవులు వ్యవహారించిన నాగమల్లి దుర్గా ప్రసాద్ గత ఆర్నెల్ల నుంచి తమ సామాజిక వర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా రాజకీయ అవకాశం కల్పించలేదంటూ ఒక సారి తమకు అవకాశం కల్పించాలని ఎంఎల్ఏ వద్ద మొరబెట్టుకుంటున్నారు. అయితే శాసనసభ్యుడు కూడా మూడు రోజుల క్రితం ఇక్కడకు వచ్చిన తిరుపతి పార్లమెంట్ ఇన్‌చార్జి పనబాక లక్ష్మీకి మున్సిపాలిటికి రెండు పేర్లు రిజర్వేషన్ అయితే నాగమల్లి దుర్గా పసాద్, జనరల్ అయితే జి.విజయకుమార్‌నాయుడు పేర్లు ఇచ్చినట్లు చర్చించుకుంటున్నారు.

ఇకవైకాపాలో ఎవరిని అభ్యర్థి చేయాలన్నది చర్చనీయాంశంగా మారింది. జనరల్ అయితే మాజీ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఖరారు అనుకున్నారు.కానీ రిజర్వేషన్ కావటంతో ఎవరిని ఎంపిక చేయాలనే పరిశీలనలో ఉన్నారు. అయితే మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డికి ఆయన అనుచరులు పట్టణంలో మైనారిటిలకు అవకాశం కల్పిస్తే బాగుంటుందని సలహా ఇస్తున్నారు. అంతేకాక టిఎంవి కండ్రిగకు చెందిన బత్తిరెడ్డిని రంగంలో దించాలని పరిశీలిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. అంతేకాక బుజ్జిరెడ్డి కుటుంబం నుంచి కూడా పరిశీలన జరుగుతుంది.

**అన్ని వర్గాల చూపు పవార్ కుటుంబం వైపు:**

అయితే కనబడని శక్తిగా శ్రీకాళహస్తిలో పవార్ కుటుంబం ఉంది. రాజకీయంగా నిర్వివాదాంసులు, నీతి నిజాయితికిమారు పేరుగా ఉన్న ఆ కుటుంబం పాలనలో మున్సిపాలిటి అభివృద్ధి చెందింది.ఈ నేపథ్యంలో ఇటీవల శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి పవార్‌కుటుంబం ఇంటికి వెళ్ళి ఆ కుటుంబంతో చర్చలు జరిపారు. అయితే వారిని తమపార్టీ తరఫున ఆకర్షిస్తే బాగుంటుందనే సలహాలుకూడా వైకాపా నాయకునికి ఇస్తున్నట్లు సమాచారం.మరిరాజకీయం పవార్ కుటుంబం వైపుకుమళ్ళుతుందా? అని పరిశీలకులు చర్చించుకుంటున్నారు.

## వైకాపాను వీడి తెదేపాలోకి చేరికలు

రామకుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త



మండలంలోని బళ్ల పంచాయతీ లక్ష్మీపురంకు చెందిన పది వైకాపా కుటుంబాలు సోమవారం సిఎంపిఎ శ్రీకాంత్ సమక్షంలో తెదేపాలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సిఎం చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాలు చూసి తాము తెదేపాలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్య క్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, కామరాజునాయక్, నరసింహులు, రామూర్తి, విశ్వనాథ్, రవిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, బాలరాజు, సత్తి, ఆదిల్, కేశవరెడ్డి, మంజునాథ్ పాల్గొన్నారు.

## భాకరాపేట సీఐగా తిమ్మయ్య బాధ్యతల స్వీకరణ



చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 12 ప్రభాతవార్త

భాకరాపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పి. తిమ్మయ్య సోమవారం ఉదయం విధుల్లో చేరి అధికారికంగా రిపోర్టు చేసుకున్నారు. ఆయన బాధ్యతల స్వీకరణతో భాకరాపేట సర్కిల్ పరిధిలో పోలీసు శాఖ కార్యకలాపాలు కొనసాగనున్నాయి.

## అధికారులూ.. డ్రైనేజీలను పట్టించుకోండి !!



శాంతిపురం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

మండల కేంద్రమైన శాంతిపురంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత ంలో చిన్నపాటి గ్రామంగా ఉన్న శాంతిపురం కాలక్రమేణా విస్తరించింది. సుమారు రెండువేల దాకా గృహాలు ఉన్నాయి. అయితే మండల కేంద్రంలో కనీస వసతులు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కన్పిస్తోంది. గత ప్రభుత్వ హయాంతో పాటు ప్రస్తుతం కూడా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. శాంతిపురం గ్రామం కెనమాకులపల్లి మేజర్ పంచాయతీలో ఉంది. పంచాయతీకి బడుగుమాకులపల్లి వారపుసంత ద్వారా, మండల కేంద్రంలో వివిధ పన్నుల రూపంలో ఆదాయం వస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రస్తుత గ్రామ అభివృద్ధి అధికారి అంతా తన ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలనుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేసే అధికారులు ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో ఎందుకు విఫలమవుతున్నారో. పంచాయతీ అభివృద్ధి అధికారి మండల కేంద్రంలో ఏ నిధులు ఎంత వ్యయం చేశారో చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయంగా పిడిఓ స్వాతిని ప్రభాతవార్త వివరణ కోరేందుకు యత్నించగా తనకు ఎలాంటి సంబంధం లేదని ఫోన్‌లో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించాల్సి ఉంది.

## అదుపుతప్పి ద్విచక్ర వాహనదారుడు మృతి

రామకుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త



మండలంలోని వీర్నమల గ్రామం మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన చేసుకుంది. సోమవారం స్థానికుల సమాచారం మేరకు మధ్యాహ్నం సింగం సముద్రం పంచాయతీ చింతమానత్తం గ్రామానికి చెందిన చిరంజీవి (41) గ్రామం నుంచి వీర్నమల గ్రామానికి సొంత పనుల కోసం ద్విచక్ర వాహనంలో పైన పయనమయ్యాడు. మార్గమధ్యమైన వీర్నమల, చలిమిచేయను ప్రాంతంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి బండరాయికి ఢీకొన్నాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా సోమవారోత్సవాలు

రామకుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

స్థానిక శ్రీ సుబ్రమణ్యస్వామి ఆలయంలో సోమవారోత్స వాలను ఘనంగా నిర్వహించారు. కర్ణాటక,తమిళనాడు, ఆంధ్ర ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే సమీపంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ నాగుల ముద్దమ్మ, శ్రీ శనీశ్వరస్వామి ఆలయాలతో పాటు నక్ష త్రవనంలో భక్తులు పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు దర్శన ఏర్పాట్లు కల్పించి అన్నదానం జరిపారు. సోమవారోత్స వాల సందర్భంగా రామకుప్పం జనం, భక్తులతో సందడిగా కన్పించింది.

## రాబోయే ఎంపీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో పోటీ చేస్తాం

### సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి చిన్నయ్య



రైల్వేకోడూరు అర్బన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలం సమతా నగర్ లో సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ ప్రెస్ మీట్ లో పార్టీ జిల్లా కార్యదర్శి చిన్నయ్య మాట్లాడారు. రాబోయే ఎంపీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో తమ పార్టీ తరఫున పురుషులకు అవకాశం ఇస్తే సమతా నగరకు చెందిన ఆదాం ను లేనియెడల మహిళలకు అవకాశం ఇచ్చిన పోటీ చేయిస్తామని ఆయన ప్రకటించారు. పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమకు మంచి అవకాశం వచ్చిందని చిన్నయ్య తెలిపారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని ఎంపీటీసీ స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెడతామని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతుకగా తమ పార్టీ ఉంటుందని ఆయన అన్నారు. కార్మికులు, రైతులు, దళితుల పక్షాన నిలబడి ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ గంట ఆదాం, నెల్లిపల్లి సుబ్బయ్య, పి రమణయ్య, ప్రభాకర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గాయత్రీ దేవిగా శ్రీభద్రకాళిని, బిల్వ వృక్షనిగా శ్రీవాసవి మాత



**చిట్వేలి, అక్టోబర్ 12, ప్రభాతవార్త:** దసరా శరన్నవరాత్రి ఉత్స వాలలో భాగంగా రెండవ రోజు సోమవారం పాత చిట్వేలి గ్రామంలో శ్రీ భద్రకాళి అమ్మవారు శ్రీ గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి అలంకరణ దాతలుగా రెడ్డివారి పల్లె గ్రామానికి చెందిన ప్రభాకర, ఉదయ్ వారి కుటుంబ సభ్యులు సహకారం అందించారు. కాగా ఆర్యవైశ్యుల ఆరాధ్య దేవతయిన శ్రీ వాసవి మాత త్రిమూర్తులకు ప్రతీక, మహా లక్ష్మీ నివాసమైన బిల్వ వృక్ష అలంకారంలో భక్తులను కటాక్షించారు. ఇరు చోట్ల పరిమళభరిత పుష్పాలు, పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అమ్మవార్ల రూపాన్ని అర్చకులు శోభాయమానంగా తీర్చిదిద్దారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ పెద్దలు భక్తులందరికీ తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు.

## కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎస్సీ(జనరల్)కు రిజర్వ్

– ఊహించని రీతిలో ఖరారైన రిజర్వేషన్ !!



కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలోని కుప్పం మున్సిపల్ ఛైర్మన్ పదవి ఎస్సీ (జనరల్)కు రిజర్వేషన్ అయింది. ఎవరూ ఊహించని రీతిలో ఈ దఫా రిజర్వేషన్ ఖరారుకావడం విశేషం. 2021 ఎన్నికల్లో తొలిసారి మున్సిపల్ ఎన్నికలు కుప్పంలో జరగగా ఆ ఎన్నికలకు సంబంధించి ఛైర్మన్ పదవిని జనరల్ కేటగిరీకి రిజర్వు చేశారు. అప్పట్లో 25వార్డులకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం ఛైర్మన్‌కు, కౌన్సిలర్లకు ప్రత్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఛైర్మన్ పదవి ఎస్సీ జనరల్ విభాగంకు రిజర్వ్ చేశారు. అలాగే ఇదివరకు ఉన్న వార్డులు కూడా 32కు పెరిగాయి. కాగా 32 వార్డులకు గాను ఎస్టీ జనరల్ 1 మహిళలు 0 మొత్తం 1 , ఎస్సీ జనరల్3, ఎస్సీ మహిళలు3 మొత్తం6, బిసి జనరల్ 5, బిసి మహిళలు 4 మొత్తం 9, మహిళలు జనరల్ 9, జనరల్ 7వార్డులుగా రిజర్వేషన్లు ఖరారయ్యాయని సమాచారం. కాగా కుప్పం మున్సిపల్ ఛైర్మన్ పదవిని జనరల్ లేదా బిసి మహిళలకు రిజర్వేషన్ అవుతుందని ఆయా పార్టీల నాయకులు ఊహించారు. అయితే ఎవరూ ఊహించని రీతిలో కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సీటు ఎస్సీ జనరల్ విభాగంకు రిజర్వేషన్ కావడం విశేషం.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త



మండలంలోని చెక్కునత్తం పంచాయతీలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దప్ప, నాగరత్న, మైలవేణి, ధనప్ప, చౌడప్ప, చంద్రమ్మ కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను నాయకులు పంపిణీ చేశారు. 4లక్షల రూపాయల చెక్కులను సోమవారం టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, కార్పోరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా లబ్దిదారులు సిఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నాయకులు మునిరత్నం, బీరప్ప తదితరులు పాల్గొన్నారు

## మళ్లీ సొంతగూటికి.. తెదేపాలో చేరిన గ్రామస్తులు



కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

మండలంలోని అడవిబూదుగూరు పంచాయతీ సప్పానికుంట గ్రామంకు చెందిన పలువురు గ్రామస్తులు మళ్లీ తమ సొంతగూటికి చేరారు. ఆదివారం ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో వైకాపాలో చేరిన వీరు సోమవారం పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ సమక్షంలో మరలా తెదేపాలోకి చేరారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తాము తెదేపాలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కార్పోరేషన్ డైరెక్టర్లు శరవణ, చెక్కునత్తం మణి, కడ సభ్యుడు రామచంద్ర,తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నేతలు కృష్ణమూర్తి, చిట్టిబాబు,లీలా వెంకటేష్,సంతోష్,రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

– కడ పి.డి. వికాస్ మర్మత్



కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమవారం స్థానిక మండల కార్యాలయంలో కడ పి.డి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 93వినతిపత్రాలను పి.డి.కి అందజేశారు. వీటిని స్వీకరించి అనంతరం వాటి పరిష్కారంకు సంబంధిత అధికారులను పి.డి. ఆదేశించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజల సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వంపై ప్రజల్లో మరింత సానుకూలత పెరిగేలా అధికార యంత్రాంగం పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి వాటి పరిష్కారంకు చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడ తహశీల్దార్ శివయ్య, కుప్పం తహశీల్దార్ రమేష్‌బాబు, డిఇలు పురుషోత్తం, గురవారెడ్డి, దస్తగిరి, రాము, ప్రభాకర్, ఎంపిడిఓ రాజేంద్ర ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



రామకుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

మండలంలో వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సిఎంపిఎ శ్రీకాంత్, స్థానిక నేతలు పంపిణీ చేశారు. 30.69లక్షల చెక్కులను లబ్దిదారులకు అందించారు. కార్యక్రమంలో నేతలు మునస్వామి, పత్ర నారాయణ, వెంకటరమణ, ఆనందరెడ్డి, నరసింహులు, కామరాజునాయక్, రామూర్తి, రవిరెడ్డి, విశ్వనాథ్, చంద్రశేఖర్‌రెడ్డి, సత్తి, రఘు, ఆదిల్, బాలకృష్ణ, బాలరాజు, నవీన్, మంజునాథ్ పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో మేయర్..మున్సిపల్ ఛైర్మన్ల రిజర్వేషన్లు ఇలా !!

కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్లకు మేయర్లు, మున్సిపాలిటీలకు ఛైర్మన్ స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేస్తూ సోమవారం గెజిట్, జిఓను విడుదల చేసింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని జనరల్ కేటగిరికి ఖరారు చేశారు. అలాగే చిత్తూరు కార్పొరేషన్ మేయర్ స్థానాన్ని బిసి (జనరల్)కు ఖరారు చేశారు. ఇక చిత్తూరు జిల్లాలోని కుప్పం మున్సిపాలిటీ ఎస్సీ జనరల్‌కు, నగరి జనరల్ కేటగిరీకి రిజర్వు చేశారు. అలాగే పలమనేరు మున్సిపాలిటీని మహిళ (జనరల్)కు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీని బిసి (జనరల్) కేటగిరీకి రిజర్వు చేశారు. అలాగే కావలి మున్సిపాలిటీ జనరల్ కేటగిరీకి, వెంకటగిరి మున్సిపాలిటీ మహిళ (జనరల్)కు రిజర్వు చేశారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## నగర అభివృద్దే ప్రధాన అజెండా

– ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్

చిత్తూరురూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



చిత్తూరు నగర అభివృద్దే ప్రధాన అజెండాగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ తెలిపారు. ఉదయం మిట్టూరు షాదీమహల్ వద్ద రూ. 1.24కోట్లతో నిర్మించనున్న సైనిక్‌భవన్‌కు జెసి ఆదర్శరాజేంద్రన్, చుడా ఛైర్‌పర్సన్ కఠారిహేమలత, ఇతర సైనిక అధికారులతో కలసి భూమి పూజ చేసారు. దేశ రక్షణ కోసం పోరాడుతున్న సైనికులకు జిల్లా కేంద్రంలో సైనిక్‌భవన్ నిర్మించడంపై హర్షం వ్యక్తం చేసారు. అనంతరం 11వ వార్డు చెన్నమ్మగుడి వద్ద తాగునీటి శుద్ధి ప్లాంటును ప్రారంభించారు. ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లో నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చిన్నమ్మగుడి, ఎల్బీపురం రోడ్డులో రూ. 17లక్షలతో చేపట్టిన నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటు పనులకు పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో క్లస్టర్, డివిజన్ ఇన్‌ఛార్జిలు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ప్రోగ్రెసివ్ సఫాయి కర్మచారిస్ సంఘం



### అదనపు ప్రధాన కార్యదర్శిగా మునస్వామి

చిత్తూరురూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త:

ప్రొగ్రెసివ్ సఫాయి కర్మచారిస్ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా శ్రీరంగంపల్లి మునస్వామిని ఎంపిక చేసినట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు ఇ, వీరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో జరిగిన జాతీయ నాయకుల సమావేశంలో రాష్ట్ర కమిటీని, రాష్ట్ర సలహాదారులతో పాటు చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్‌గా పనిచేస్తున్న మునస్వామిని రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసారు. పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చేస్తున్న సేవలను గుర్తించి కమిటీలో ఎంపిక చేయడం ఎంతో ఆనందంగా వుందని, ఈ సందర్భంగా జిల్లా, రాష్ట్ర, జాతీయ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## సింగిల్ విండో రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

తవణంపల్లె, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



మండలంలోని అరగొండ సింగిల్ విండో ద్వారా అందిస్తున్న స్వల్పకాలిక పంట రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.రంజిత్‌రెడ్డి అన్నారు. సోమవారం అరగొండ నెహ్రూ వీధిలోని ఆర్ ఆర్ కాంప్లెక్స్‌లో అరగొండ సింగిల్ విండో ఆధ్వర్యంలో బంగారు ఆభరణాలపై రుణాల మంజూరు సేవలను పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాల దృష్ట్యా అతి తక్కువ వడ్డీతో బంగారు అభరణాలపై రుణ సదుపాయం అందించనున్నట్లు తెలిపారు. రైతుల ఆర్థిక అవసరాలను తీర్చుకోవడానికి ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రంజిత్‌రెడ్డి కోరారు. రుణాల మంజూరుపై ప్రాసెసింగ్ చార్జీలను పూర్తిగా ఉచితమని ఆయన తెలిపారు. అలాగే ప్రతి నెలా కోటి రూపాయల మేర బంగారుపై రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రంజిత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండోసీఈఓరవి, సింగిల్‌విండో డైరక్టర్‌లు విజయ్‌కుమార్, వెంకటేష్,రైతునాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 53 ఫిర్యాదులు

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



ఎస్పీ తుషార్ డూడి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పాత పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంకు ప్రజల నుండి 53 ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన ఎస్పీ తుషార్ డూడి సత్వరం క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ తుషార్ డూడితో పాటు ఆపరేషన్స్ ఎఎస్పీ ఎస్.షాను, అడ్మిన్ ఎఎస్పీ మహబూబ్‌భాషా, చిత్తూరు డిఎస్పీ వెంకటనారాయణలు ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ తగాదాలకు సంబంధించి 12, చిన్న గొడవలు 10, డబ్బు తగాదాలు 9, భూ తగాదాలు 4, చీటింగ్ 3, ఇంటి తగాదాలు 3, పోలీసు సేవలు 3, బెదిరింపులు 3, వేధింపులు 2, ఆస్తి తగాదాలు 2, దారి సమస్యలపై 2 సమస్యలు అందాయి.

## నేషనల్ మీడియేషన్ క్యాంపెయిన్ 3.0 విజయవంతంకు చర్యలు

– జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి

చిత్తూరు, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



జిల్లాలో పెండింగ్‌లో వున్న సివిల్, క్రిమినల్ తదితర కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నేషనల్ మీడియేషన్ క్యాంపెయిన్ 3.0 కింద విస్తృత స్థాయిలో చర్యలు చేపట్టినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎంఎస్ భారతి పేర్కొన్నారు. జిల్లా కోర్టులో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎంఎస్ భారతి విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, నిర్ధేశిత ప్రామాణిక కార్యాచరణ విధానం ప్రకారం 2026 ఆగస్టు 1 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసులను గుర్తించడం, ప్రీ మీడియేషన్ స్క్రీనింగ్ నిర్వహించడం, సంబంధిత పక్షాలకు నోటీసులు జారీ చేయడం, అర్హమైన కేసులను మధ్యవర్తిత్వానికి రెఫర్ చేయడం వంటి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వైవాహిక వివాదాలు, చెక్‌బౌన్స్ కేసులు, రాజీకి వీలున్న క్రిమినల్ కేసులు, వినియోగదారుల వివాదాలు, రుణ వసూళ్ళ కేసులు, ఎగ్జిక్యూషన్ పిటీషన్లు, ఆర్బిట్రేషన్, వాణిజ్య వివాదాలు, ఆస్తి విభజన, సర్వీస్ వివాదాలు, ఖాళీ చేయింపు, భూసేకరణ, కార్మిక వివాదాలు తదితర కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించేందుకు గుర్తించినట్లు ఆమె తెలిపారు. జిల్లాలో ఆగస్టు 1 నుండి సెప్టెంబర్ 30వ తేదీ వరకు మొత్తం 1,439 కేసులను గుర్తించి, వాటిలో 388 కేసులను మధ్యవర్తిత్వానికి రెఫర్ చేయడం జరిగిందన్నారు. ప్రజలు తమ వివాదాలను దీర్ఘకాలంకోర్టుల్లో కొనసాగించకుండా మధ్యవర్తిత్వం ద్వారా సామరస్యపూర్వక పరిష్కారం పొందడానికి ముందుకు రావాలని కోరారు.

## అనుమతిలేని చిట్ ఫండ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### కుప్పం ఎఎస్‌పి హేమంత్



కుప్పం, అక్టోబర్ 12 ప్రభాతవార్త

కుప్పం సబ్ డివిజన్ పరిధిలో చట్టబద్ధమైన నమోదు, అవసరమైన అనుమతులు లేకుండా చిట్ ఫండ్‌ల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కుప్పం ఎఎస్‌పి హేమంత్ హెచ్చరి ్చారు. ఇటువంటి అక్రమ కార్యకలాపాల వల్ల ప్రజలు తమ కష్టార్జిత సొమ్మును కోల్పోయే ప్రమాదం ఉన్నదన్నారు. చిట్ ఫండ్స్ చట్టం, 1982 ప్రకారం, చట్టపరంగా అవసరమైన నమోదు ప్రక్రియను పూర్తి చేయకుండా, సంబంధిత నిబంధనలను ఉల్లంఘిస్తూ చిట్ వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా శిక్షార్హ్హ అన్నారు . ఏదైనా చిట్ ఫండ్‌లో చేరే ముందు దాని చట్టబద్ధతను, నమోదు వివరాలను సంబంధిత అధికారుల ద్వారా తప్పనిసరిగా ధృవీకరించుకోవాల న్నారు. చట్టబద్ధమైన నమోదు, అవసరమైన అనుమతులు లేని చిట్ ఫండ్‌లలో డబ్బులు చెల్లించవద్ద న్నారు. అధిక లాభాలు, ఖచ్చితమైన రాబడులు వస్తాయని ఇచ్చే ఆకర్షణీయమైన హామీలకు మోసపోవద్ద న్నారు. అక్రమ చిట్ ఫండ్‌ల నిర్వహణ, అనధికారికంగా డబ్బుల వసూలు లేదా ఆర్థిక మోసాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాల న్నారు.

# తిరుపతి డివిజన్

## స్థానిక ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటాం:

### ముక్కా రూపానంద రెడ్డి

రైల్వేకోడూరు రూరల్ అక్టోబర్ 12(ప్రభాతవార్త)::



రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటామని రైల్వేకోడూరు టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపానంద రెడ్డి అన్నారు. సోమవారం రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్నది ఎన్నికల సమర భేరి అని వాటిని ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఎన్నికలలో కూటమి ప్రభుత్వాన్నికి బహుమతిగా అందజేస్తామని అన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించి అన్ని విధాల రైల్వే కోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు శ్రీకారం చుట్టానున్నామనీ ఆయన పేర్కొన్నారు. రైల్వే కోడూరు నియోజకవర్గానికి వందల కోట్ల అభివృద్ధి పనులు చేపడుతున్నామని ప్రజలు సరైన తీర్పు ఇచ్చే విధంగా కృషి చేయాలని అన్నారు. ఇప్పటికే ఐదు మండలాలలో అభివృద్ధి పరుగులు తీసే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. అభాగ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధిని ఇంటి వద్దకే తీసుకువెళ్లి వారికి భరోసా కల్పిస్తున్నామని అన్నారు. తాను మాయమాటలు చెప్పనని చెప్పిందే చేస్తానని ఆయన అన్నారు. గత ప్రభుత్వం మాయ మాటలతో కాలయాపన చేసి ప్రజల వద్ద గోర్ల బొక్క పడిందని అందువల్లే వైసీపీ ప్రభుత్వం ప్రజల్లో కనుమరుగైందని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ లు పోటీపడి పనిచేస్తున్నారని రాష్ట్రాన్ని అగ్ర పదాన పెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో గాలికి వదిలేసిన పరిపాలనను ప్రస్తుతం గాడిలో పెట్టి లా అండ్ ఆర్డర్ ను చట్టపరంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఇప్పటికే దేశ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ గురించి ఆర్థిక శాస్త్రవేత్తలు కూడా కొనియాడుతున్నారని అన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో పెట్టుబడులతో పారిశ్రామిక వాడల నిలుస్తుందని, త్వరలో నిరుద్యోగులకు ఎన్నో లక్షలాది ఉద్యోగాలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించే దిశగా పయనిస్తున్నదని,అదే విధంగా రానన్న స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా నియోజకవర్గస్థాయి నాయకుల సహకారంతో ఐదు మండలాలలో తిరుగులేని విజయాన్ని సొంతం చేసుకుంటామని టిడిపి ఇన్చార్జ్ ముక్కా రూపనంద రెడ్డి తెలియజేశారు.

## ఎన్‌డీటీవీ గోల్ఫ్ ప్రోయామ్ టోర్నమెంట్‌లో పాకాల యువతి దిలేషా ప్రతిభ.

### హైదరాబాద్‌లో ఘనంగా ముగిసిన టోర్నమెంట్.. ఏకైక మహిళా క్రీడాకారిణిగా ప్రత్యేక ఆకర్షణ

పాకాల, అక్టోబర్ 12 ప్రభాతవార్త




హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్‌డీటీవీ ఐజీపీఎల్ గోల్ఫ్ ప్రోయామ్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ క్రీడా వేడుకల్లో ప్రతిభ, అంకితభావం, నైపుణ్యాన్ని చాటిన గోల్ఫ్ క్రీడాకారులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. టోర్నమెంట్ ముగింపు వేడుకలకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ముఖ్య అతిథిగా హాజరై విజేతలను అభినందించారు. అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, ట్రోఫీలను అందజేశారు.ఏకైక మహిళా క్రీడాకారిణిగా దిలేషా ప్రత్యేక ఆకర్షణ ఈ టోర్నమెంట్‌లో పాకాలకు చెందిన యువతి దిలేషా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేదికపైకి ఎంపికైన ఏకైక మహిళా క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందారు. తొలిసారిగా ఈ తరహా టోర్నమెంట్‌లో పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్నిచ్చిందని దిలేషా తెలిపారు. "ఈ పోటీల్లో ఆడటం నాకు ఇదే మొదటిసారి. ఈ అనుభవం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి మరిన్ని టోర్నమెంట్లలో పాల్గొనేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు. దిలేషా ప్రతిభను అభినందించిన నిర్వాహకులు, సభికులు చప్పట్లతో ఆమెను ప్రోత్సహించారు. అనంతరం టోర్నమెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇతర క్రీడాకారులకు ట్రోఫీలు అందజేసి ముగింపు వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. ప్రతిష్ఠాత్మక గోల్ఫ్ టోర్నమెంట్‌లో పాకాల యువతి దిలేషా పాల్గొని ప్రత్యేక గుర్తింపు పొందడం పట్ల స్థానికంగా హర్షం వ్యక్తమవుతోంది.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన చంద్రగిరి డీఎస్పీ

చిన్నగొట్టిగల్లు, అక్టోబర్ 12 ప్రభాతవార్త



ప్రభాతవార్త :మండల పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను చంద్రగిరి డీఎస్పీ జగదీష్ నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లోని మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి కేంద్రాల్లో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ పరిశీలనలో సీఐ తిమ్మయ్య, ఎస్ఐ కృష్ణయ్య, ఎస్‌బీ ఏఎస్ఐ దస్తగిరి పాల్గొన్నారు.

## దేశం సుభిక్షం చేయడానికే వరుణయాగం

### కైలాష్ గురూజీ

రామచంద్రాపురం, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



దేశాన్ని సుభిక్షం చేయడానికి వరుణయాగం నిర్వహిస్తున్నామని ప్రాణ యోగా ఆశ్రమ వ్యవస్థాపకులు కైలాష్ గురూజీ అన్నారు. ఆశ్రమ ప్రాంగణంలో సోమవారం వరుణయాగం రెండవ రోజు కొనసాగింది. వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ సహస్ర గట్టాభిషేకాలు, వరుణ మంత్ర జపాలు చేశారు. కారిష్టి హోమం, నిత్యాగ్నిహోత్రులు, శ్రౌతహోమం నిర్వహించారు. అశ్వము, నల్లగొర్రెను మంత్ర జలంతో ప్రోక్షణ గావించి యాగాన్ని కొనసాగించారు. నల్లకర్జూరం, నల్లతేనె కలిపిన పధార్థాలను దేవతలకు నివేధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేదపండితులు, ఆశ్రమ నిర్వహకులు పాల్గొన్నారు.

## వైసీపీ నుండి భారీగా టిడిపిలో చేరిక



తిరుపతి, అక్టోబర్ 12ప్రభాతవార్త:

తిరుపతి నియోజకవర్గంలో గత వైసిపి హయాంలో అన్యాయాలు, అక్రమాలు అనేకం చేసారని, వారి బలవంతంగా, బెదిరించి పార్టీలో చేర్చుకున్న అనేక మంది టిడిపి కుటుంబ సభ్యులు తిరిగి సొంతగూటికి చేరుతున్నారని నియోజకవర్గం ఇన్చార్జి జెబి శ్రీనివాస్ అన్నారు. తిరుపతి నియోజకవర్గానికి చెందిన దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, సాయి, పార్ధసారథి, పద్దు, ధన సహా 300 మంది తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఇనచ్ఛార్జి శ్రీనివాస్, క్లస్టర్ ఇన్ఛార్జ్ పులిగోరు మురళీకృష్ణా రెడ్డితో కలిసి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన దొడ్డారెడ్డి శంకర్ రెడ్డి, సాయి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు లోకేష్ సారథ్యంలో టిడిపి తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి జెబీ శ్రీనివాస్ నేతృత్వంలో తిరుపతి అభివృద్ధి పథంలో ప్రయాణిస్తుందన్నారు.

## ప్రపంచ ఆహార దినోత్సవం అవగాహన

తిరుపతి,అక్టోబర్ 12ప్రభాతవార్త:



పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హోమ్ సైన్స్ విభాగానికి చెందిన డాక్టర్ కీమీరా మేడమ్ విద్యార్థులకు ఆహారం, పోషకాహారం, సమతుల్య ఆహారం మరియు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్ల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎ. శోభ ఆధ్వర్యంలో నిర్వహించబడింది.

## బీసీలకు టీడీపీలోనే సముచిత స్థానం!

### జయహో బీసీ సభలో ఎమ్మెల్యే పులివర్తి నాని



తిరుపతి రూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :

బీసీల అభ్యున్నతి, సంక్షేమం, రాజకీయ ప్రాతినిధ్యానికి తెలుగుదేశం పార్టీ ప్రాధాన్యమిస్తోందని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ గుర్తింపు కల్పించగా, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి అభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. వైసీపీ పాలనలో బీసీలు వెనుకబడ్డారని ఆయన విమర్శించారు. తిరుపతి రూరల్ మండలం తనపల్లి రోడ్డులోని రఘునాథ రిసార్ట్స్‌లో చంద్రగిరి నియోజకవర్గ స్థాయి "జయహో బీసీ ఆత్మీయ సమావేశం ఎమ్మెల్యే పులివర్తి నాని అధ్యక్షతన నిర్వహించారు. చిత్తూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు షణ్ముఖం రెడ్డి, నరసింహ యాదవ్, సీఆర్ రాజన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ, బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత చంద్రబాబు నాయుడిదేనని పేర్కొన్నారు. బీసీ కార్పొరేషన్ల ద్వారా రూ.51,012 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. బీసీలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీసీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా ఉండాలని, ప్రతిపక్షాల విమర్శలు, ప్రలోభాలకు ప్రభావితం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామం, పంచాయతీలో పార్టీ విజయానికి సమష్టిగా పనిచేయాలని కోరారు. బీసీలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో. యాదవ కార్పొరేషన్ చైర్మన్ ఎన్నికల క్షత్రియ రాష్ట్ర అధ్యక్షుడు సిఆర్ రాజన్ బడి సుధా యాదవ్ పెద్ద ఎత్తున బీసీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతే లక్ష్యం.. ప్రయాణికుల ప్రాణాలే ముఖ్యం

### డ్రైవర్లకు రవాణా శాఖ అధికారుల సూచనలు

రేణిగుంట, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రయాణికుల పట్ల మర్యాదగా, గౌరవంగా వ్యవహరించాలని తిరుపతి జిల్లా రవాణా శాఖ అధికారులు సూచించారు. రేణిగుంటలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రయాణికులతో ప్రవర్తన, డ్రైవర్ల క్రమశిక్షణపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి మురళీమోహన్, ప్రాంతీయ రవాణా అధికారి సుబ్రహ్మణ్యం, మోటారు వాహనాల తనిఖీ అధికారి స్వర్ణలత పాల్గొని పలు సూచనలు చేశారు. వాహనాలను వేగ నియంత్రణతో నడపాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, నిరక్ష్యంగా వాహనాలు నడపడం, నిబంధనలు ఉల్లంఘించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలకు ప్రతిరోజూ రవాణా సేవలందిస్తూ జీవనోపాధి పొందుతున్న డ్రైవర్లు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. డ్రైవర్ల సమస్యలను అధికారులు సానుకూలంగా విని, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అధికారులు, డ్రైవర్లు, ప్రయాణికులు సమష్టిగా బాధ్యతతో వ్యవహరించినప్పుడే రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత ప్రయాణాన్ని అందించగలమని తెలిపారు. కార్యక్రమంలో రేణిగుంట పోలీసు అధికారులు, సీఐటీయూ నాయకులు వాసు, సెల్వరాజు, రేణిగుంట రైల్వే స్టేషన్ వరసిద్ధి వినాయక ట్యాక్సీ యూనియన్ నాయకులు మీర్జావల్లి, వాసు, సుధా, వరసిద్ధి వినాయక ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు మహేష్, పి.వాసు, సాయిబాబా ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు వెంకటేష్, శ్రీనివాస ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు రావణ, ఛత్రపతి శివాజీ మహారాజ్ ఆటో యూనియన్ గౌరవాధ్యక్షులు దాము, మదర్ తెరిసా ఆటో యూనియన్ నాయకులు వీరబాబు, బాలాజీ, నాగరాజుతో పాటు పలువురు ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు పాల్గొన్నారు.

## కరాటేతో ఆత్మవిశ్వాసం.. స్వీయరక్షణ

### ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య

పులిచెర్ల, అక్టోబర్ 12 ప్రభాతవార్త:



కరాటే శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, శారీరక దృఢత్వంతో పాటు స్వీయరక్షణ నైపుణ్యాలు పెంపొందుతాయని మండల విద్యాశాఖ అధికారులు సిద్ధరామయ్య, పోకల తాతయ్య పేర్కొన్నారు.పులిచెర్లలో యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్ట్ టెస్ట్, బెల్ట్ ప్రమోషన్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. నేటి సమాజంలో విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మరక్షణ విద్య ఎంతో అవసరమన్నారు. ముఖ్యంగా బాలికలు కరాటే నేర్చుకోవడం ద్వారా తమను తాము రక్షించుకునే సామర్థ్యంతో పాటు మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో మదనపల్లె, పీలేరు, పులిచెర్ల ప్రాంతాలకు చెందిన సుమారు 50 మంది విద్యార్థులు పాల్గొని కరాటే విన్యాసాలతో ఆకట్టుకున్నారు.పులిచెర్లలో అకాడమీ ప్రారంభమైన అనంతరం తొలిసారిగా నిర్వహించిన బెల్ట్ టెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అకాడమీ మాస్టర్ జి. ఎనాముల్ హక్ పర్యవేక్షణలో విద్యార్థుల పంచ్‌లు, కిక్స్, బ్లాక్‌లు, కటాస్, స్వీయరక్షణ నైపుణ్యాలను పరిశీలించి ప్రతిభ ఆధారంగా బెల్ట్ ప్రమోషన్ నిర్వహించారు.యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో కరాటేపై ఆసక్తి పెంపొందించేందుకు మరిన్ని శిక్షణ శిబిరాలు, పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులను క్రమశిక్షణతో కూడిన ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాణి, ఎస్ఎంసీ చైర్మన్ రాధాకృష్ణ, అకాడమీ నిర్వాహకులు నందిని, సురేంద్రనాథ్, శ్వేత, వినోద్, యామిని, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## న్యూఢిల్లీ ఛాంపియన్‌షిప్‌లో తిరుపతి క్రీడాకారుల సత్తా

### విజేతలను సత్కరించిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి విద్య అక్టోబర్ 12 ప్రభాత వార్త

అంతర్జాతీయ కెటిల్‌బెల్ పోటీల్లో తిరుపతి క్రీడాకారులు పతకాలతో తమ ప్రతిభను చాటారు. న్యూఢిల్లీలో నిర్వహించిన ఐయూకేఎల్ ప్రపంచ కెటిల్‌బెల్ ఛాంపియన్ షిప్-2026లో ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన తిరుపతి క్రీడాకారులు పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సోమవారం దుశ్శాలువాలతో సత్కరించి అభినందించారు. పది దేశాలకు పైగా క్రీడాకారులు పాల్గొన్న ఈ అంతర్జాతీయ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు మొత్తం 12 బంగారు, ఒక వెండి, ఒక కాంస్య పతకాన్ని సాధించింది. తిరుపతికి చెందిన నమ్రత వాకా, నిహారిక రుద్రరాజు మూడేసి బంగారు పతకాలు గెలుచుకోగా, జీలాని బాషా, ఈ.కె.కె. వనజ రెండేసి బంగారు పతకాలు సాధించారు. కోచ్, క్రీడాకారుడు మునీర్ షేక్ ఒక బంగారు పతకం గెలుచుకోగా, విష్ణవి మండలం వెండి పతకం, వివేక్ చౌదరి కాంస్య పతకాన్ని సాధించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, తిరుపతిని క్రీడా కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో తిరుపతి క్రీడాకారులు పతకాలు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. విజేతలు భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో రాణించాలని తెలిపారు.



## నగరపాలక సంస్థకు 39 వినతులు

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 12 ప్రభాతవార్త



నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 39 వినతులు వచ్చాయని రెవిన్యూ అధికారి రవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 13 మంది, కార్యాలయంకు నేరుగా వచ్చి 26 మంది వినతులు సమర్పించి తమ సమస్యలు తెలిపారు. సుబ్బారెడ్డి నగర్‌లో అనుమతులు లేకుండా బహుళ అంతస్థులు నిర్మిస్తున్నారని పిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు పరిశీలించాలని, నెహ్రూ నగర్లో ఇండ్ల మధ్యలో చెత్త వేస్తున్నారు తగు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ గృహాల కొరకు కట్టిన నగదు తిరిగి ఇప్పించాలని, శ్రీ నగర్ కాలనిలో తెలుగుగంగ నీరు సక్రమంగా రావడం లేదని, ఆర్.కె.పురంలో కాల్వలు శుభ్రం చేయడం లేదని, బొమ్మగుంట, నారాయణ పురంలో కాలువలు, రోడ్లు పాడైపోయాయి మరమ్మత్తులు చేయించాలని, తాతయ్యగుంటలో డ్రైనేజి సమస్యలు పరిష్కరించాలని, సుందరయ్య నగర్ దోభీ ఘాట్‌ను మరమ్మత్తులు చేయించాలని, పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద వీధి దీపాలు వెలగడం లేదని పిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, వెటర్నరీ ఆఫీసర్ గుణ శేఖర్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, మేనేజర్ హసీమ్, శానిటరీ సూపర్వైజర్లు చెంచయ్య, సుమతి మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## శెట్టిపల్లి భూబాధితులకు న్యాయం చేయాలి

### సీపీఎం జిల్లా కార్యదర్శి మందవాసి నాగరాజు



తిరుపతి రూరల్, అక్టోబర్ 12 ప్రభాతవార్త :

శెట్టిపల్లి భూబాధితులకు పెండింగ్‌లో ఉన్న ప్లాట్లను తక్షణమే కేటాయించి, రిజిస్ట్రేషన్ల సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగకపోవడంతో అక్టోబర్ 12న తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట శెట్టిపల్లి ప్లాట్ల భూబాధితుల కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. కమిటీ అధ్యక్షుడు జి. చిన్నబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, వామపక్ష నాయకులు పాల్గొని దీక్షలకు మద్దతు తెలిపారు. 387, 388, 389, 397, 402, 403, 409/1, 410, 411/11, 425/1, 426/3, 426/4, 426/5, 426/7 సర్వే నంబర్లలో ప్లాట్ల కేటాయింపు, రిజిస్ట్రేషన్ల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని కమిటీ పేర్కొంది. ప్రభుత్వం సుమారు 2,100 మందికి ప్లాట్లు కేటాయించినప్పటికీ, మిగిలిన బాధితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు సమర్పించి, ధర్నాలు నిర్వహించినా సమస్య పరిష్కారం కాలేదని తెలిపింది. ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని, పెండింగ్ ప్లాట్లపై సమగ్ర విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్లలో ఉన్న అభ్యంతరాలను పరిష్కరించి ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని, స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అమ్ములు, రాజశేఖర్, వెంకటేష్, అనసూయ దేవి, వేణు, రామచంద్రయ్య, అలేఖ్య, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## పాకాలలో వైసీపీకి భారీ షాక్..

### టీడీపీలోకి 100 మంది చేరిక

పాకాల, అక్టోబర్ 12 ప్రభాతవార్త



పాకాల మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ముస్లిం నేతలు సహా సుమారు 100 మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. పాకాల మండలానికి చేరుకున్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మత పెద్దలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పాకాల బస్టాండ్ వద్ద ఉన్న టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత నందమూరి తారక రామారావు విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పాదయాత్రగా భారతం మిట్టుకు చేరుకున్న ఆయన పార్టీ చేరికల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మునీర్ భాయ్‌తో పాటు పలువురు ముస్లిం నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరగా, ఎమ్మెల్యే పులివర్తి నాని వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ వైసీపీ నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలతో కలిసి మెలిసి ఉంటూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతామని తెలిపారు. 2029లో వైసీపీ అధికారంలోకి వస్తే గ్రామాలు వదిలి వెళ్లాల్సి వస్తుందని కొందరు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ విమర్శించారు. 2029, 2034 ఎన్నికల్లోనూ వైసీపీ అధికారంలోకి వచ్చే అవకాశాలు లేవని వ్యాఖ్యానించారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి పనిచేసే పార్టీ అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రతిపక్ష పార్టీ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బ్రహ్మచారిణి అలంకరణలో ద్వితీయ దుర్గ

### వైభవంగా "శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి" నవరాత్రి ఉత్సవాలు

చంద్రగిరి, అక్టోబర్ 12 ప్రభాతవార్త:




బ్రహ్మచారిణి అలంకరణలో ద్వితీయ దుర్గ భక్తులకు దర్శన మిచ్చారు. తొండవాడ పంచాయ తీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల గంటల వరకు అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి 9 గంటల నుండి 12 గంటల వరకు బ్రహ్మచారిణి హోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణతో దేధీప్యమానంగా ముస్తాబు చేశారు. అమ్మవారి సేవకు చంద్రగిరికి చెందిన వి.హేమనారాయణరెడ్డి, వి.శోభారాణి, వెంకటగిరికి చెందిన ఎన్.శేఖర్ దాతలుగా వ్యవహరించారు.

# శ్రీకాళహస్తి డివిజన్

## స్థానిక సమరానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభతవార్త: తిరుపతి జిల్లా డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు ఆధ్వర్యంలో రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో సంసిద్ధత కొరకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. డీసీసీ అధ్యక్షులు బాలగురవం బాబు మాట్లాడుతూ రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అన్ని స్థానాలలో పోటీకి సిద్ధంగా ఉంటుందని అదేవిధంగా ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీని ప్రజలలోకి తీసుకువెళ్లి కాంగ్రెస్ పార్టీ చేసినటువంటి అభివృద్ధి కార్యక్రమాలను వివరించి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. తలపా దామోదరం రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రజలు హక్కున చేర్చుకుంటారని, భారతదేశ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ద్వారానే మెరుగైన జీవనశైలి సాధ్యమవుతుందని, అన్ని విధాల కాంగ్రెస్ పార్టీ సంసిద్ధంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు మాంగాటి గోపాల్‌రెడ్డి, తమటం వెంకట నరసింహులు, ఓబీసీ కర్ణాటక రాష్ట్ర పరిశీలకులు మురళి,జ్యోతిశ్వర్ నాయక్, సీతారాం, చిరంజీవి,శ్రీను గౌడ్, కృష్ణమూర్తి, మణి, జిల్లా కార్యదర్శి ఇళయరాజా, రావణన్,సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, నాగరాజు, మహేష్, అరుణ్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో అస్తవ్యస్తంగా ట్రాఫిక్ వ్యవస్థ



శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త: పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకీ తీవ్రమవుతోంది. ప్రధాన రహదారులు, నాలుగు మాడ వీధుల్లో నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అమలు చేసిన వన్‌వే విధానం ఇప్పుడు పూర్తిగా కనుమరుగవడంతో వాహన దారులు గగ్గోలు పెడుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ట్రాఫిక్ పోలీసులు పట్టణంలో వన్‌వే ట్రాఫిక్‌ను కఠినంగా అమలు చేసేవారు. దీంతో కొంత మేర ట్రాఫిక్ క్రమబద్ధీకరించబడింది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వన్‌వే అమలు చేస్తున్న ప్రాంతాలలోనే ఆటోలు అడ్డంగా వస్తున్నాయి, ఎక్కడ పడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా బేరివారి మండపం, నగిరి వీధి, నెహ్రూ వీధి, జయరామారావు వీధుల్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి. స్కూలు, కాలేజీ సమయాల్లో విద్యార్థులు, మహిళలు రోడ్డు దాటాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. పట్టణంలోని ఎల్‌ఐసీ ఆఫీస్ వద్ద, జయరామారావు వీధిలో ఉన్న హోల్‌సేల్ దుకాణాల వద్ద నడిరోడ్డుపై లారీలు, ఆటోలు ఆపి సరుకులు దించుకుంటున్నారు. దీంతో వెనుక వచ్చే వాహనాలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ట్రాఫిక్‌ను కట్టుదిట్టం చేయాలని, నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ బి. పావని ప్రత్యేక దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలంతా కోరుతున్నారు. నో పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేయడం, వన్‌వేను మళ్లీ కఠినంగా అమలు చేయడం, హోల్‌సేల్ దుకాణాలకు సరుకులు దించుకునేందుకు నిర్దిష్ట సమయం కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

## గోకులం షెడ్డుకు భూమి పూజ



తొట్టంబేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: మండల పరిధిలోని చిన్న కనపర్తి గ్రామంలో పులి సంపూర్ణమ్మకు మంజూరైన గోకులం షెడ్డు నిర్మాణానికి టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు చెరుకూరి రమాదేవి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. చెరుకూరి రమాదేవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ముఖ్యంగా పాడి రైతులకు గోకులం షెడ్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. గ్రామాల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించడం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, పాల ఉత్పత్తి పెరిగి రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొర్రపాటి వాసు నాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ చలపతి, శంకర్ నాయుడు, గ్రామ టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, మహిళా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేదమాత అలంకారంలో గ్రామదేవత



ఏర్పేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: ఏర్పేడు గ్రామదేవత శ్రీఎల్లమ్మ తల్లి సోమవారం సకల వేదాలకు మూలమైన జ్ఞానప్రదాయిని శ్రీగాయత్రీ దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చి పునీతుల్ని చేశారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఉదయం నుంచే ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు, సహస్ర కుంకుమార్చనలు, వేద మంత్రాలతో గాయత్రీ మంత్ర జపాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నానికి గాయత్రీ దేవి అలంకారంలో సర్వాభరణ భూషితురాలై, చేతిలో వేదశాస్త్రాలను ధరించి, ముక్తా మణిమయ కాంతులతో ఎల్లమ్మ తల్లి దర్శనమివ్వడంతో భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. గాయత్రీ దేవిగా దర్శనమిస్తే సకల పాపాలు తొలగి, జ్ఞానం, బుద్ధి, ఐశ్వర్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం. అందుకే ఈ అలంకారాన్ని తిలకించేందుకు ఏర్పేడు మాత్రమే కాకుండా చుట్టుపక్కల గ్రామాలైన బత్తినపల్లె, పాపాయ్యగుంట, చెన్నయ్యగారి పల్లె తదితర గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

## మా భూమి మాకు ఇప్పించండి



తొట్టంబేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: తరతరాలుగా తాము అనుభవిస్తున్న భూమిని అగ్రకులానికి చెందిన వారు బలవంతంగా ఆక్రమించేశారని, దళితులమైన మాకు న్యాయం చేయండంటూ బోనుపల్లి గ్రామానికి చెందిన వెంకటాద్రి సోమవారం జరిగిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఆర్డీవో భాను ప్రకాష్‌కు వినతి పత్రం అందించి తన గోడును విన్నవించుకున్నారు. వెంకటాద్రి తన వినతి పత్రంలో పేర్కొన్న వివరాల ప్రకారం తన తాత బోడయ్య పేరు మీద సర్వే నంబర్ 193/1లో ఒకటిన్నర ఎకరా ప్రభుత్వ భూమి ఉంది. ఆయన చనిపోయిన తర్వాత తన తండ్రి పోలయ్య పేరు మీదకు ఆ భూమి వచ్చింది. తండ్రి చనిపోయిన తర్వాత తల్లి రాగమ్మ పేరు మీద ఆ భూమి కొనసాగుతోంది. తరతరాలుగా తామే సాగు చేసుకుంటున్న ఈ భూమిని ఇటీవల అగ్రకులానికి చెందిన కొందరు వ్యక్తులు బలవంతంగా ఆక్రమించుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబానికి న్యాయం చేసి తమ భూమిని తమకు ఇప్పించాలని కన్నీటి పర్యంతమయ్యారు. దళితుడి ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన ఆర్డీవో భాను ప్రకాష్ త్వరలోనే బోనుపల్లి గ్రామానికి స్వయంగా వచ్చి గ్రామ సభ ఏర్పాటు చేసి రెవెన్యూ రికార్డులను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## విఏఓలకు శిక్షణా కార్యక్రమాలు



బుచ్చినాయుడు కండ్రిగ, అక్టోబర్ 12 ప్రభాతవార్త: గ్రామ సమైక్య సమావేశాల్లో అర్హులైన నిరుపేదలను గుర్తించాలని ఏపియంమునెయ్య తెలిపారు సోమవారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం నందు విఒ లీడర్లు, విఒఎ లకు జీరో పావర్టీ మిషన్ పై శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏపియం మునెయ్య మాట్లాడుతూ ప్రణాళిక సంఘం ద్వారా స్వర్ణ గ్రామం వారీగా జాబితా లు ఇవ్వడం తిందని,సమాచారము వచ్చిన తరువాత ఈ నెల 25వ తేది లోపు స్వర్ణ గ్రామం వారీగా గ్రామ సమాఖ్య ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రణాళిక సంఘం ఇచ్చిన మార్గదర్శకాలు ప్రకారం అర్హులు ను గుర్తించి వారి వివరాలు ఈ నెల 25వ తేది నుండి నవంబర్ 5 వరకు పంచాయతీ లో ప్రదర్శించి దీని పై అభ్యంతరాలు స్వీకరించి తదనంతరం వాటిని పరిశీలించి తుది జాబితా తయారు చేసి నవంబర్ 6వ తేది నుండి 15వ తేది లోపు గ్రామ సమాఖ్య ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానము చేయాలి .జాబితా ప్రకారం అర్హులు వివరాలు అనర్హులు వివరాలు నవంబర్ 16వ తేది నుండి 25వ తేది లోపు విఒఏ లకు ఇచ్చిన జీరో పావర్టీ మిషన్ యాప్ వివరాలు 100శాతం నమోదు చేయాలని తెలియ చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సిసి లు పయని, జీవ, వెంకటరత్నం, అకౌంటెంట్ హిమగిరిజ, యం.యస్.లీడర్లు శ్వేత, భారతి, లావణ్య, సంఘమిత్ర లు, గ్రామ సమాఖ్య లీడర్లు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి టెన్నిస్ జట్టులో...జిల్లా క్రీడాకారులు





శ్రీకాళహస్తి,అక్టోబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తిలో మూడు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ టెన్నిస్ టోర్నమెంటులో జాతీయ స్థాయి జట్టును ఎంపిక చేసారు. మూడు రోజుల పాటు జరిగిన పోటీలు సోమవారంతో ముగిసాయి. మూడు టీంలను జాతీయ స్థాయి జట్లుగా ఎంపిక చేసారు.ఈ టీంలు ఈ నెల 23 నుంచి న్యూఢిల్లిలో జరిగే జాతీయ స్థాయిలో పోటీల్లో ఎపి టీంలుగా పోటీ పడనున్నారు.ఈ మేరకు సోమవారం ఇక్కడ విక్రమ్ టెన్నిస్ అకాడమి ఆవరణలో ముగింపు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిదిగా జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి అమ్ములు హాజరయ్యారు. ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ క్రీడలు,క్రీడాకారులకు తిరుపతి జిల్లా నెలవుగా ఉందన్నారు. అందులో శ్రీకాళహస్తిలో టెన్నిస్‌కు పెట్టింది పేరుగా ఉందన్నారు. ఇక్కడ సుమారు 35 సంవత్సరాల పాటు జాతీయ స్థాయిలో రిపబ్లిక్ క్లబ్ టెన్నిస్ టోర్నమెంటు నిర్వహించారన్నారు. స్కూల్‌గేమ్స్ నిర్వహణ చర్చ వచ్చినపుడు రాష్ట్ర సంఘం శ్రీకాళహస్తికి అవకాశం కల్పించటం ఈ ప్రాంతానికి గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు. పోటీల్లో తిరుపతిజిల్లా కు చెందిన క్రీడాకారులు భాగస్వాములు కావటం అదృష్టం అన్నారు.

**జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన జట్లు ఇవే:**

శ్రీకాళహస్తి మూడురోజుల పాటు జరిగిన స్కూల్ గేమ్స్ టెన్నిస్ పోటీల్లో జరిగేజాతీయ స్థాయి జట్లును ఎంపిక చేసారు. వివరాలు ఇలా ఉన్నాయి. 14సంవత్సరాల లోపు బాలికల జట్టులో పివి సుక్తి శ్రీ(గుంటూరు),పప్పాల లాస్యప్రియ (విశాఖ పట్టణం),మోటుపల్లి చాందిని(తిరుచానూరు),ముత్తా వశిష్వి (విశాఖ పట్టణం) గాంధీ సుధిక్ష(విశాఖ పట్టణం),స్టాండ్‌బైగా వేణి ఆలిషనిరెడ్డి (గుంటూరు)పియాషిచా శర్మ(మదనపల్లి), కుక్కల చైత్రా శ్రీప్రియ( పాలకొల్లు)లు ఎంపికయ్యారు.

**విజేతలకు బహుమతులు:**

మూడు రోజుల పాటు ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తూ బహుతులను షీల్డ్‌లను నిర్వాహకులు అందించారు.ఈ కార్యక్రమాల్లో ప్రత్యేంగా ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి ఎంపిక కావటం అభినందనీయం అన్నారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి అమ్ములు, శ్రీకాళహస్తి రిపబ్లిక్‌క్లబ్ కార్యదర్శి మన్మధరావు,రాష్ట్ర టెన్నిస్ పరిశీలకులు షేక్‌బాబు,శివకృష్ణల చే బహుమతులు అందించారు.ఈ కార్యక్రమాల్లో ఆర్గనైజింగ్ కార్యదర్శి కిషోర్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీధర్, భక్తగోపాల్, రమేష్‌రెడ్డి,మురళిలు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో వార్డుల గందరగోళం!

### -అస్తవ్యస్థ విభజన : అంజూరు తారక శ్రీనివాసులు



శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో వార్డుల పునర్విభజన అశాస్త్రీయంగా సాగిందని వైకాపా ధ్వజమెత్తారు.ఈ మేరకు మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో కమిషనర్ కెవి కృష్ణారెడ్డికి వినతి పత్రం అందించారు. గతంలో ఉన్న 35 వార్డులను 44 వార్డులుగా పెంచుతూ చేపట్టిన పునర్విభజన ప్రక్రియ పూర్తిగా అధికార పార్టీకి అనుకూలంగా, అశాస్త్రీయంగా జరిగిందంటూ వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు భగ్గుమన్నాయి. వార్డుల విభజనను తక్షణమే నిలిపివేసి, న్యాయబద్ధంగా పునః పరిశీలించాలంటూ వినతి పత్రం అందజేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజూరు మీడియాతో మాట్లాడుతూ వార్డుల పునర్విభజన పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారు. ఇది పునర్విభజన కాదు... ప్రత్యర్థులను దెబ్బతీసేందుకు చేస్తున్న రాజకీయ కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1వ వార్డు అరాచకం, వి.ఎం.పల్లి, కే.ఎం.పల్లి, జైహింద్ పురంలలో ఉన్న 1,694 ఓట్లను పక్కనే ఉన్న 2వ వార్డులో కలపకుండా, ఏకంగా 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న 42వ వార్డు బి.పి. అగ్రహారంలో కలపడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కొండకు సెంటర్‌కు లింకా?.. కొండ అవతల ఉన్న కైలాసగిరి కాలనీని తీసుకెళ్లి తుఫాన్ సెంటర్‌తో కలపడం, మద్రాసు రోడ్డులోని తంగిడిపాలెంను పిచ్చాటూరు రోడ్డులోని రాజీవ్ నగర్‌తో కలపడం చూస్తుంటే అధికారులు మ్యాప్ చూడకుండానే వార్డులు గీశారా? అనే అనుమానం వస్తోందన్నారు.

**కమిషనర్‌కు వినతి:** ఈ అక్రమ పునర్విభజనను వెంటనే నిలిపివేసి, స్థానిక ప్రజలు, మాజీ కౌన్సిలర్లు ఇచ్చిన అభ్యంతరాలను పరిశీలించి ధర్మబద్ధంగా మళ్లీ విభజన చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆర్కాట ముత్తు, మహబూబ్ బాషా, కంఠ ఉదయ్ కుమార్, పసల సుమతి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్ర రాజు, శ్రీవారి సురేష్, పటాన్ ఫరీద్, గోర, మైనంపాటి మస్తాన్, ఆర్కాట్ శంకర్, బాల్ శెట్టి చంద్రశేఖర్ తదితర వందలాది మంది కార్యకర్తలు పాల్గొనడంతో మున్సిపల్ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారి దర్శనం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 10 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి దివ్యక్షేత్రంలో జరుగుతున్న దసరా మహోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయాలు మహిళా భక్తులతో కిట కిట లాడాయి. శ్రీకాళహస్తీశ్వ రాలయంలో ఉదయం నుంచి ఇసుకేస్తే రాలనంతర ద్ది చోటు చేసుకుంది. అమ్మవారి గర్భగుడి ఎదురుగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారిని ఉదయం బ్రహ్మచారిణి అలంకారం కన్నులు మిరుమిట్లు కొల్పునట్లు తీర్చిదిద్దారు.కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో వెలసిన అమ్మవారికి మీనాక్షి అమ్మవారి అలంకారం జరిపారు.సోమవారం కావటంతో వేకువ జాము నుంచి మహిళా భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అమ్మవారికి అలంకారాల్లో దర్భా తులసి చక్కగా తీర్చి దిద్దుతూ భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు. ఉభయదారులుగా కోనేటి జగదీశ్వరరావు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## బంగారు గాజుల వితరణ



శ్రీకాళహస్తి,అక్టోబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి బెంగుళూరు వాసులు బంగారు గాజులను వితరణగా అందించారు. సోమవారం బెంగుళూరుకు చెందిన ప్రమీలాబాయి కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గతంలో కూడా రెగ్యూలర్‌గా వస్తున్న వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆమె ఎఇఒ హేమామాలిని కలసి విరాళం అందించాలని కోరారు.ఈ నేపథ్యంలో ఆమె రూ.3.73లక్షల విలువ కల్గిన 24.5గ్రాముల బంగారు గాజులను విరాళం అందించారు. వారికి ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల అంతరాలయం దర్శనంతో పాటు స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో ప్రోటోకాల్‌ఎఇఒ లోకేష్‌బాబు,దాతలు విభాగం ఇన్‌చార్జి నాగయ్య, అకౌంటెంట్ యుగంధర్, అప్రైజర్ బాలాజి తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి దేవి అలంకారంలో అనందవల్లి





ఏర్పేడు,అక్టోబర్ 12 ప్రభాతవార్త: మండ లంలోని గుడిమల్లంలో వెలసిన అనందవల్లి అమ్మవారికి దసరా మహోత్సవాల సం దర్భంగా సోమవారం ప్రత్యేకాలంకారం జరి పారు. ఆలయంలో దసరా మహోత్సవాలను ఈ ఏడాది భారీ ఎత్తున నిర్వహించుటకు ఆలయ చైర్మెన్ బత్తల గిరి నాయుడు, ఇఒ మునిశేఖర్‌లు నిర్ణయించారు. కలశ స్థాపనతో కార్యక్రమాలు మొదలయ్యాయి. ఉదయం నుంచి ఆలయంలో మహిళా భక్తుల తాకిడి పెరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళా భక్తులు మొక్కులు తీర్చుకొనటానికి కదలి వచ్చారు. కాగా శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలోవెలసిన దక్షిణ కాళీ మాత ఆలయంలో అమ్మవారికి గాయత్రి దేవి అలంకారం నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు దొరైరాజు వారి కమిటి సభ్యులు భక్తుల ఏర్పాట్లును పర్యవేక్షించారు. పొరుగున ఉన్న కర్నాటక, తమిళనాడు రాష్ట్రా నుంచి మహిళా భక్తులు తరలి వచ్చారు.

## దేవి నవరాత్రి ఉత్సవాల్లో బియ్యపు



శ్రీకాళహస్తి,అక్టోబర్ 12 (ప్రభాత వార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి కుమార్తె కాటంరెడ్డి పవిత్రారెడ్డి శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనకాచలంపై వెలసిన దుర్గమ్మ ఆలయంలో పూజలు జరిపించుకున్నారు. మహిళా భక్తులకు పసుపు దారాలు అందించారు. పవిత్రారెడ్డి కాలినడకన దుర్గమ్మ ఆలయానికి అనుయాయులతో కలసి దర్శించుకున్నారు. ఆమె భవాని దీక్షలో అమ్మవారి దర్శనాలకు హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేకాభిషేకాలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆమెతో పాటు మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు మున్నారాయల్,బుల్లెట్ జయశ్యాం రాయల్, వైకాపా నాయకులు కంచి గురవయ్య, అప్పిని సుధాకర్ మైలాపూర్ లోకేష్, కార్తీక్ యాదవ్, మహమ్మద్, అనంద్, మునీర్, సూర్య,రవి తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇన్‌చార్జ్‌ల శిక్షణ



శ్రీకాళహస్తి అక్టోబర్ 12 ప్రభాతవార్త: మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో రెండురోజుల పాటు నిర్వహించిన యూనిట్ స్థాయి శిక్షణ తరగతుల్లో శ్రీకాళహస్తి నియోజక వర్గ యూనిట్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.ఈ మేరకే శ్రీకాళహస్తి నుంచి నెమళ్ళూరు బుజ్జి, రామకృష్ణయాదవ్, మునిరాజ యాదవ్, ఆర్ముగం, మందల రామూర్తిలు శిక్షణకు హాజరైనట్లు బుజ్జి తెలిపారు.ఈ శిక్షణలో యూనిట్ ఇన్‌చార్జ్‌ల విధులు, బాధ్యతలు నాయకత్వ లక్షణాలు ప్రజలతో మమేకమయ్యే తీరుపై సీనియర్ నాయకులు వివరించారు.

## రెడ్డివారిని సత్కరించిన వన్నెకుల సంఘం



ఏర్పేడు అక్టోబర్ 12 ప్రభాతవార్త: ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథలయాల చైర్మెన్, నెల్లూరు అర్బన్ పరిశీలకులు రెడ్డివారి గురువారెడ్డిని సోమవారం ఆయన స్వగృహంలో వన్నెకుల క్షత్రియ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో ఎంతో నిబద్ధతతో క్రియాశీలకంగా పనిచేస్తూ గ్రంథలయ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నందుకు అభినందిస్తూ శాలువా పూలమాలతో సత్కరించారు. మారుమూల గ్రామాల్లో మినీ గ్రంథలయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆయనకు పార్టీ పరిశిలకుడిగా అదనపు బాద్యతలు రావడం తమ సామాజిక వర్గానికి గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మునిక్రిష్ణారెడ్డి, కేశవరెడ్డితదితరులు పాల్గొన్నారు.

## డిఎస్పీకి సిపిఐ నాయకుల సత్కారం



శ్రీకాళహస్తి, అక్టోబర్ 12 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి డిఎస్పీ పావనిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాలతో సిపిఐ నాయకులు సత్కరించారు.ఈ మేరకు పట్టణంలో నెలకొన పలు సమస్యలను డిఎస్పీ దృష్టికి తీసుకెళ్ళినట్లు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య తెలిపారు.ప్రధానంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడడం,ట్రాఫిక్ సమస్యల నియంత్రణ, ఆలయానికి వచ్చే భక్తుల భద్రత,దళారి వ్యవస్థ నిర్మూలన వంటి వాటిపై దృష్టి సారించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు ప్రజానాట్యమండలి చారులత, వైఎస్ మణి, శివకుమార్,గోపి,శ్రీనివాసులు ,మునిచందు, మురళీ, బాబు, రాజయ్యలు ఉన్నారు.

## పుస్తక పఠనంతోనే జ్ఞానాభివృద్ధి : గురువారెడ్డి



ఏర్పేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం బండారుపల్లి గ్రామంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రెడ్డివారి గురువారెడ్డి అధ్యక్షతన సోమవారం మినీ గ్రంథాలయం (పుస్తక నిక్షిప్త కేంద్రం)ను ప్రారంభించారు. గురువారెడ్డిని, నాయకులే గ్రామస్తులు స్వాగతం పలికారు. చైర్మన్ నాయకులతో కలిసి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను ఆయన పరిశీలించారు. జిల్లాలో 71 శాఖా గ్రంథాలయాలు, 102 మినీ గ్రంథాలయాలు ఉన్నాయని, వీటన్నింటినీ అభివృద్ధి చేసి డిజిటలైజేషన్ చేస్తామని అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తోందని, యువత, విద్యార్థులు గ్రంథాలయాలను వినియోగించుకుని పుస్తక పఠనం వైపు మొగ్గు చూపి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సహకారంతో మండలంలోని పెద్ద గ్రామాల్లో మినీ గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పేరం నాగరాజు నాయుడు మార్కెట్ కమిటీ చైర్మన్ రంగినేని చెంచయ్య నాయుడు, రాష్ట్ర కార్యదర్శి సుబ్బయ్య, క్లస్టర్ ఇంచార్జ్ పేట బాలాజీ రెడ్డి, సీనియర్ నాయకుడు నిరంజన్ బాబు నాయుడు, గుడిమల్లం ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ గిరినాయుడు ఆలయ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని గ్రంథాలయానికి బహుకరించారు. కార్యక్రమంలో ఏర్పేడు పీఏసీఎస్ అధ్యక్షుడు మహేష్ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణవేణి, క్లస్టర్ ఇంచార్జ్ లు రాఘవేంద్రరావు, కిష్టప్ప, మాజీ వైస్ ఎంపీపీ మురుగన్ తదితర పాల్గొన్నారు.

## పూడి గిరిజనులకు న్యాయం చేయండి



తొట్టంబేడు, అక్టోబర్ 12 ప్రభాతవార్త: తమ హక్కుగా ఉన్న భూముల కోసం పెత్తందారులకు ఎదురొడ్డి పోరాడుతున్న గిరిజనులకు న్యాయం చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి హరినాథ్ విజ్ఞప్తి చేశారు. పూడి గిరిజనులతో కలిసి ఏకలవ్య ఎరుకుల సంక్షేమ సంఘం, ఏపీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం తొట్టంబేడు తహశీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముఖ్య అతిధిగా హరినాథ్ హాజరయ్యారు. కేవీపీఎస్ నాయకులు అంగేరి పుల్లయ్య, గంధం మణి, పెనగడం గురవయ్య మద్దతు పలికారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ పూడి రెవెన్యూలోని సర్వే నెం.143 నుంచి 150 వరకు 2.79 ఎకరాల భూమిని తాత ముత్తాతల కాలం నుంచి అక్కడి గిరిజనులు వారసత్వంగా సాగు చేసుకుంటున్నారని గుర్తు చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం ఎదుట రిలే దీక్షలు చేపట్టగా ఆర్డీవో స్పందించి గిరిజనులకు భూములు స్వాధీనం చేయాలని తొట్టంబేడు తహశీల్దార్‌ను ఆదేశించినట్లు గుర్తు చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు.